నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

## పోటెత్తిన గోదావరి

- జత కలిసిన మంజీరా
- ఎస్సారెస్పీకి భారీ వరద
- నాలుగు రోజుల్లోనే 52 టీఎంసీలు



కందకుర్తి బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న గోదావరి

మోర్తాడ్/రెంజల్, సెప్టెంబర్ 4: మహోగ్ర రూపం దాల్చిన గోదావరి ఇంకా శాంతించలేదు. మంజీరా తోడు కావడంతో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నది. బుధవారం ఉదయం రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి వరద ఉధృతి భయాందోళనకు గురి చేసింది. నదిపై నిర్మించిన వంతెన మీదుగా వరద పొంగి పొర్లింది. భారీ వర్షాల నేపథ్యంలో మహారాష్ట్రలోని విష్ణుపురి, బాబ్లీ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదతో పాటు మంజీరా నది ఉధృత ప్రవాహంతో శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తింది. 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో 41 గేట్లు ఎత్తి 3.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, 1089.60 అడుగుల (75.314టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంచి, మిగులు జలాలను దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

**ఈ సీజన్‌లో 117 టీఎంసీల ఇన్‌ఫ్లో..**

శ్రీరాంసాగర్‌కు గత నాలుగు రోజుల్లోనే 52.948 టీఎంసీల వరద వచ్చింది. ఈ సీజన్‌లో అంటే జూన్ 1 నుంచి బుధవారం వరకు మొత్తం 117.68 టీఎంసీల నీరు వచ్చి చేరింది. జూన్‌లో 3.995 టీఎంసీలు, జూలైలో 27.258, ఆగస్టులో 33.482 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. 51.713 టీఎంసీల మేర అవుట్‌ఫ్లో రూపంలో వెళ్లిందని అధికారులు తెలిపారు.

## బ్యాక్‌వాటర్‌లో 350 ఎకరాల మునక

నవీపేట,సెప్టెంబర్ 4: ఎస్సారెస్పీకి వరద పోటెత్తడంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన పొలాలను బ్యాక్ వాటర్ ముంచెత్తింది. గోదావరి పరీవాహక ప్రాంతాలైన కోస్లి, మిట్టాపూర్, యంచ, నందిగామ, బినోలా తదితర గ్రామాల్లో 350 ఎకరాల్లోని పంట నీట మునిగిందని వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ తెలిపారు. నీట మునిగిన పంటలను బుధవారం పరిశీలించారు.



నవీపేట మండలం నందిగామలో నీట మునిగిన పంటలు

# కుండపోత

**వర్షం మళ్లీ దంచికొట్టింది.** మంగళవారం అర్ధరాత్రి తర్వాత కుండపోత వాన కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీళ్లు చేరాయి. చెరువులు, వాగులు ఉప్పొంగి రోడ్లపైకి నీరు చేరడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. మరో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 6.11 సెం.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా డొంకేశ్వర్‌లో 16.23, ఆలూర్‌లో 12.15, మోపాల్‌లో 14.12, ఇందల్వాయిలో 11.33, డిచ్‌పల్లిలో 10.16, వేల్పూర్‌లో 10 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.

–ఖలీల్‌వాడి/కంఠేశ్వర్, సెప్టెంబర్ 4



మాణిక్‌భండార్ వద్ద జాతీయ రహదారిపై ఉధృతంగా పారుతున్న వరదనీరు



ఖానాపూర్‌కు వెళ్లే దారిలో మోకాలి లోతు వరకు నిలిచిన వర్షపు నీరు. అవస్థలు పడుతున్న వాహనదారులు

- అర్ధరాత్రి దంచికొట్టిన వాన
- ఇందూరు, ఆర్మూర్‌లో ఇండ్లలోకి చేరిన నీరు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



ఆర్మూర్ హౌసింగ్‌బోర్డులోని ఓ ఇంట్లోకి చేరిన నీరు

**నిజామాబాద్** నగరంతో పాటు శివారులో ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి వరదనీరు రావడంతో రాత్రంతా జాగారం చేశారు. మాలపల్లి, ఆటోనగర్‌లో ఇండ్లలోకి నీళ్లు చేరాయి. ఖానాపూర్, మాణిక్ బండార్, రేడియో స్టేషన్ ప్రాంతాల్లోకి వరద చేరింది. రోడ్లపై మోకాలి లోతులో నీళ్లు చేరాయి. ఖానాపూర్‌కు వెళ్లే రోడ్డుపైకి భారీగా వరద చేరడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ఉదయం 11 గంటలు దాటినా వర్షపు నీరు తగ్గక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ ఖానాపూర్, మాణిక్‌భండార్ ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలను పరిశీలించారు. ఆర్మూర్‌లో అర్ధరాత్రి భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ఇండ్లలోకి నీళ్లు చేరాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**నిలిచిన రాకపోకలు**

మాణిక్‌భండార్ వద్ద నిజామాబాద్–ఆర్మూర్ ప్రధాన రహదారిపై వరద నీటి ఉధృతితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు ఒకవైపు రోడ్డును మూసివేసి, వాహనాలను దారి మళ్లించారు. మరోవైపు, వరద నీరు రోడ్డుపైకి రావడంతో మండలంలోని బినోలా–నందిగామ మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు వాహనాలను అనుమతించలేదు. ధర్పల్లి మండలంలోని పెద్ద చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బద్దొడి మామిళ్ల వద్ద ఉన్న కల్వర్టు పైనుంచి వరద ఉప్పొంగింది. దీంతో సీతాయిపేట్ గ్రామానికి రాకపోకలు నిలిచి పోయాయి. ఇందల్వాయి మండలంలోని గన్నారం చెరువు అలుగు, చిన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గన్నారం గ్రామానికి రాకపోకలు గ్రామానికి తెగిపోయాయి. నల్లవెల్లికి ఉదయం వెళ్లే బస్సు గ్రామశివారులో ఆగిపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత ప్రవాహం తగ్గడంతో ఎస్సై రాజేశ్వర్ తన సిబ్బందితో ప్రయాణికులను వాగు దాటించారు. నగర శివారులోని దుబ్బ నుంచి ఖానాపూర్, కాలూర్ వెళ్లే రోడ్డులో భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



సైదబోయి (ఫైల్)

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 4 : బీర్కూర్ శివారులోని గైపీర్ల వాగులో ఈ నెల 1న చేపల వేటకు వెళ్లి గల్లంతైన బీర్కూర్‌కు చెందిన సైదబోయి(35) మృతదేహమై తేలాడు. ప్రమాదవశాత్తు వలలో చిక్కుకోవడంతో వరద నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాడు. బంధువులు అతని కోసం గాలించగా బుధవారం వాగు వద్ద అతని మృతదేహం కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**మోర్తాడ్‌లో మరొకరు..**

మోర్తాడ్, సెప్టెంబర్ 4 : మొండివాగులో మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన సురేశ్ అనే వ్యక్తి మృతదేహం బుధవారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో లభ్యమైంది. ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిండిన నిజాంసాగర్



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీటిని చూసేందుకు వచ్చిన ప్రజలు

నిజాంసాగర్, సెప్టెంబర్ 4: భారీ వర్షాలతో మంజీరా నది పోటెత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో బుధవారం సాయంత్రం ఒక గేటు ఎత్తి మిగులు జలాలను దిగువకు వదిలారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పూజలు చేసి నీటిని వదిలారు. మొన్నటిదాకా బోసిపోయిన ప్రాజెక్టు భారీ వర్షాలతో జలకళ సంతరించుకుంది. ఎగువ నుంచి 30 వేల క్యూసెక్కుల పైగా వరద వస్తుండడంతో మిగులు జలాలను దిగువకు విడిచి పెడుతున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగుల (17.802 టీఎంసీలు)కు గాను ప్రస్తుతం 1403.45 అడుగుల (15.900) మేర నీరు నిల్వ ఉంచి, వచ్చిన నీటిని వచ్చినట్లు కిందకు వదులుతున్నారు.

## నీటి నిల్వ పెంచి రైతులను ముంచొద్దు

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

రెంజల్, సెప్టెంబర్ 4: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 4–5 టీఎంసీల నీటి నిల్వను పెంచి రైతులను ఇబ్బందులు పెట్టొద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. చేతికొచ్చిన పంటలు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో మునిగిపోయి అన్నదాతలు ఆందోళన చెందుతున్న సమయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి వరదను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 70 టీఎంసీల నీటి నిల్వ ఉన్నప్పుడు, ఎగువన ఉన్న ఒక్క ఎకరం కూడా మునగలేదన్నారు. అయితే, ఎస్సారెస్పీలో అదనంగా 4.5 టీఎంసీల నీటి నిల్వను పెంచడంతో పంటలు మునుగుతున్నాయన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వను పెంచి రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. ఈ విషయంలో మంత్రి ఉత్తమ్ వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రాజెక్టులో వాటర్ లెవల్‌ను పెంచడమే కాదు, రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత కూడా మీదేనని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు.



కందకుర్తి వద్ద గోదావరినది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

## స్కూల్‌లోకి చేరిన వర్షపు నీరు



తరగతి గదిలో వర్షపు నీరు

రామారెడ్డి, సెప్టెంబర్ 4:రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండాలో గల ప్రభుత్వ పాఠశాలలోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షాల నేపథ్యంలో రెండ్రోజులు స్కూళ్లకు సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు గదుల నిండా నీళ్లు కనిపించాయి. పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. అలాగే, విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫామ్స్‌తో పాటు ఎలక్ట్రికల్ వస్తువులు తడిసి పోయాయి. గదుల్లోకి నీరు చేరడంతో బుధవారం తరగతులు నిర్వహించలేదని హెడ్మాస్టర్ వేణుగోపాల్ తెలిపారు.

## ఒక పక్క నీళ్లు.. మరో పక్క పాఠాలు..



**పాఠశాల స్లాబ్ ఉరుస్తుండడంతో..** విద్యార్థులను ఒక పక్కన కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాడు. నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంట తండా ప్రాథమిక పాఠశాల గది స్లాబ్ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉరుస్తోంది. దీంతో ఉపాధ్యాయుడు మనోజ్ ఇలా విద్యార్థులను ఓ పక్కన కూర్చోబెట్టి పాఠాలు బోధించాడు.

– నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 4

## మన టీచర్లకు 'ఉత్తమ' అవార్డులు



స్వర్ణలత, సుధాకర్ గౌడ్, రామకృష్ణ

ఖలీల్‌వాడి/కామారెడ్డి/మాచారెడ్డి, సెప్టెంబర్ 4: ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలువురు టీచర్లను అవార్డులకు ఎంపిక చేసింది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఆలూరు జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న నరేందర్, దుబ్బ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముద్దు కృష్ణను ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. అలాగే, కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ, మాచారెడ్డి మండలం పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్ టి.స్వర్ణలత రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించనున్న కార్యక్రమంలో వీరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

**ఉత్తమ అధ్యాపకులుగా..**

మోర్తాడ్/భిక్కనూరు, సెప్టెంబర్ 4: ఉమ్మడి జిల్లా నుంచి ఉత్తమ అధ్యాపకులుగా తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో సహా ఆచార్యులుగా పని చేస్తున్న డాక్టర్ ఆర్.సుధాకర్‌గౌడ్, మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న ఎంపికయ్యారు.

## చనిపోతే నరకమే..





నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 4: ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులు, బంధువులకు నరకమే. మృతదేహాన్ని దహనం చేసేందుకు ప్రాణాలకు తెగించాల్సిన పరిస్థితి ఉంటుంది. నలభై ఏండ్లుగా దుస్థితి నెలకొంది. నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో అన్ని వర్గాలకు చెందిన శ్మశాన వాటిక ఉంది. అయితే, కాలక్రమేణా పడావు భూములన్నీ సాగులోకి రావడంతో శ్మశానవాటికకు వెళ్లే దారి లేకుండా పోయింది. ఎవరైనా చనిపోతే వరి పంటల మధ్య నుంచి బురదనీటిలో అర కిలోమీటర్ దూరం వెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి ఉంటుంది. బుధవారం గ్రామానికి చెందిన మంగళి అంజమ్మ చనిపోవడంతో అష్టకష్టాలను పడుతూ గ్రామస్తులు అంత్యక్రియలను పూర్తి చేశారు. శ్మశాన వాటికకు రోడ్డు వేయాలని కలెక్టర్‌తో పాటు మండల అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బాన్సువాడ దవాఖానకు వైద్యుల నియామకం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బాన్సువాడ, సెప్టెంబర్ 4: బాన్సువాడ దవాఖానకు ఐదుగురు వైద్యులను నియమించారు. ఇక్కడి ఎంసీహెచ్, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న అంశాన్ని ఎత్తి చూపుతూ 'నాడి పట్టే వారేరి?' శీర్షికన ఆగస్టు 30న 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. 45 మంది వైద్యులకు గాను 17 మంది ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం అధికారుల్లో కదలిక తెప్పించింది. బాన్సువాడ దవాఖానలో ఐదుగురు వైద్యులు విధులు చేరారని డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. కంటి వైద్య నిపుణుడు విజయ్ భాస్కర్, పిల్లల వైద్యుడు విజయ్‌రాజ్, రేడియాలజిస్టు సంతోష్, గైనకాలజిస్టు ప్రొఫెసర్ కళావతితోపాటు మరొకరిని నియమించగా, వారు బుధవారం విధుల్లో చేరారని చెప్పారు.




